క్లుప్తంగా

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

భద్రాచలంటౌన్: రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని భద్రాచలం మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య వివరించారు. కూనవరం రోడ్డులోని రవాణా శాఖ కార్యాలయం వద్ద శనివారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

అల్పాహారం పంపిణీ



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలో ఉన్న సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని హెచ్ఎం బెక్కంటి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సమయంలో ఐటీసీ వారు బిస్కెట్లు, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు అల్పాహారాన్ని పంపిణీ చేస్తుండగా.. పాఠశాలలోని 61 మంది పది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అనిల్ కుమార్, నాగేశ్వరరావు, వెంకట్రావు, రామారావు, చిలకమర్రి శ్రీనివాసు, రత్నకుమారి, మధుసూదన్ రావు, కేజియా, తిరుపతిరావు, రాంజీ, సాయికుమారి, విజయబాబు, స్వామి, శేషయ్య, సరోజిని, సునీత, మండల రిసోర్స్ పర్సన్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ జయంతి



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి దుస్సా సమ్మయ్య

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీలో ఉన్న పద్మశాలి భవన్‌లో శనివారం పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతిని నిర్వహించారు. తొలుత మార్కండేయుడి చిత్రపటానికి సంఘం మండల అధ్యక్షుడు డాక్టర్ దుస్సా సమ్మయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీయులంతా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి కోట శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మహేశ్వరపు రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్ర నాగరాజు, ఉపాధ్యక్షుడు అందె వెంకటేశ్వర్లు, కొరివి బసవయ్య, వెనకాల వెంకన్న, జాగరపు కనకయ్య, సిరిపురం కోటేశ్వరరావు, తాడి సత్యనారాయణ, కె.రంగయ్య పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓ అశోక్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధిహామీ పథకం ఉద్యోగులు

చండ్రుగొండ: పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఉపాధి పథకం ఉద్యోగులు ఎంపీడీఓ బయ్యారపు అశోక్‌కు శనివారం వినతిపత్రం అందించారు. మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగపరంగా దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు వేతనాలు ప్రతినెల 1వ తేదీన చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో దశలవారి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఉపాధి పథకం ఏపీఓ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ నాయకురాలికి నివాళి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన సీపీఐ జిల్లా నాయకురాలు గణేశుల అమ్మాజి మృతదేహానికి శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య, బీజేపీ నియోజకవర్గ నాయకుడు పొడియం బాలరాజు, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీ, టీజేఎస్ నాయకులు, స్థానికులు ఉన్నారు.



జాతరలో ఊరేగింపు.. (ఫైల్)

సండే స్పెషల్



ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం

అమ్మ జాతరకు వేళాయే..

- రేపటి నుంచి దుమ్ముగూడెం ముత్యాలమ్మ జాతర
- తొమ్మిది రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు
- నిత్యాన్నదానానికి ఏర్పాట్లు పూర్తి
- భారీగా తరలిరానున్న భక్తులు

కోరిన కోర్కెలు తీర్చే గ్రామదేవతగా పేరొందిన దుమ్ముగూడెం ముత్యాలమ్మ అమ్మవారి జాతరకు వేళయింది. ఈ నెల 3వ తేదీ నుంచి 11 వరకు అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ అమ్మవారి జాతరను నిర్వహించడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి వచ్చే జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి పూనుకున్నారు.

మూడు ఊరేగింపులు ప్రత్యేకత..

ముత్యాలమ్మ అమ్మవారి 9 రోజుల జాతరలో భాగంగా 3వరోజు, 6వ రోజు, 9వ రోజు గ్రామ పురవీధుల్లో గరిగెలతో ఊరేగింపు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గ్రామంలోని యువకులు ఆడవారిగా వేషధారణ వేసుకుని అమ్మవారి గరిగెలను తలపై ఉంచుకుని గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి నైవేద్యాలను స్వీకరిస్తారు. ఊరేగింపుకు ఆలయం నుంచి బయలుదేరే ముందు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆ సమయంలో ఆలయంలోని ధ్వజస్తంభంపై ఉన్న గంటలు మోగడం అమ్మవారి నిజరూపానికి దర్శనం. ఆఖరి రోజు ఊరేగింపులో కోయ వారి కొమ్ము నృత్యం, బేతాళా సెట్ బృందం, కింగ్‌కాంగ్, రాక్షసి బొమ్మలు, డప్పువాయిద్యాలతో నిర్వహించే ఊరేగింపు జాతరకు హైలెట్‌గా నిలుస్తాయి. అలాగే భారీ ఎత్తున నిర్వహించే బాణాసంచా కాల్చడం ఆహుతులను కళ్లు తిప్పుకోకుండా చేస్తాయి.

దుమ్ముగూడెం: 1978 నుంచి జాతరగా ఆనవాయితీగా వస్తోంది. జాతర కమిటీ ఏర్పడిన తరువాత 23వ జాతర (పండుగ) మహోత్సవానికి ముస్తాబవుతోంది. ప్రతి ఏడాదీ గ్రామదేవత ఉత్సవాన్ని 9 రోజుల పాటు వైభవోపేతంగా జరపటం ఆనవాయితీ. జాతరలో ప్రతి రోజు సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించటం ఈ జాతర ప్రత్యేకత. ఇందులో భాగంగా ఆలయానికి రంగులు, పందిళ్లు వేసే పనులను చేపట్టారు. సోమవారం జాతర మొదటి రోజున ఉదయం 11గంటలకు పొలిమేర కట్టి, సాయంత్రం అఖండ దీపారాధన చేస్తారు. పుట్టమన్ను తీసుకొని వచ్చి ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఈ ఏడాది ప్రతీ జాతరకు ఏర్పాటు చేసినట్టే 9రోజులు అన్నదానం ఏర్పాటు చేయడానికి కావాల్సిన ఏర్పాట్లను ఆలయ కమిటీ చూస్తోంది.

తరలిరానున్న భక్తజనం..

దుమ్ముగూడెం గ్రామంలో జరిగే ముత్యాలమ్మ అమ్మవారి జాతరకు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. రెండేళ్లకోసారి జరిగే జాతర కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకుంటారు.

అలరించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో తొమ్మిది రోజుల రాత్రి సమయంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అవి భక్తులను ఎంతగానో ఆకట్టుకోనున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జాతర మొదటి రోజు బాబి ఈవెంట్స్ ఆధ్వర్యంలో డాన్స్ బేబీ డాన్స్, రెండో రోజు మాయాబజార్ నాటకం, మూడో రోజు మోహన్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సినీ మ్యూజికల్ నైట్, 4వ రోజు స్వప్న ఆర్ట్స్ ఆధ్వర్యంలో సినీ డూప్స్, 5వ రోజు గుడ్ విల్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సినీ మ్యూజికల్ నైట్, 6వ రోజు భీమవరం స్వాతి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్, 7వ రోజు శ్రీదేవి డ్రామా కంపెనీ ఫేమ్ పల్సర్ బైక్ ఝాన్సీ, రమేష్ మాస్టర్ ఆధ్వర్యంలో డాన్స్ హంగామా, 8వ రోజు సుప్రీమ్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సినీ మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు జరుగుతాయి.

జాతరలో నిత్యం అన్నదానం..

ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో తొమ్మిది రోజులు ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. కరోనా సమయంలో తప్పా ప్రతీ జాతరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలు అమ్మవారి జాతరలో అన్నదానం చేయడానికి విరివిగా ముందుకు వచ్చి చేయూతనందిస్తుంటారు. ప్రతీ రోజు వేల సంఖ్యలో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి అవాంతరాలు జరుగకుండా కొనసాగడం గమనార్హం.

విజయవంతానికి కృషి..



ముత్యాలమ్మ జాతరను మండల ప్రజలు, దాతలు, అధికారుల సహకారంతో విజయవంతం చేయడానికి ఆలయ కమిటీ అహర్నిషలు కృషి చేస్తోంది.

– చుక్కా గణేష్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

శిశు గృహాన్ని సందర్శించిన జడ్జి



శిశుగృహానికి పాలపౌడర్ డబ్బాలు అందజేస్తున్న న్యాయమూర్తి శివనాయక్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న కారా సెంటర్ శిశు గృహాన్ని శనివారం భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివ నాయక్ సందర్శించారు. వారి బాగోగులను చూస్తున్న హోమ్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపి, పసిపిల్లలకు కావాల్సిన 10 పాల పౌడర్ డబ్బాలు, 20 ప్రొటీన్ పౌడర్ డబ్బాలను శిశుగృహ మేనేజర్ చంటిబాబుకు అందజేశారు. సాధ్యమైనంత వరకు నెలనెలా పిల్లల అవసరమయ్యే సరుకులు అందించేలా తగు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఏ.సత్యనారాయణ, ఎస్.సతీష్, బి.శారద, డి.సంధ్య, ఎస్.మల్లేష్, భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి సహకరించాలి



గిరిజన రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు

అశ్వారావుపేటరూరల్: ఆర్థికంగా వెనుకబడిన గిరిజన రైతుల అభివృద్ధికి విద్యుత్ శాఖ అధికారులు సహకరించాలని మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు కోరారు. శనివారం ఆయన మండలంలోని ఊసిర్లగూడెం గ్రామంలో పర్యటించారు. అనంతరం మాజీ సర్పంచ్ మొడియం నాగమణి నివాసంలో స్థానిక గిరిజన రైతులు, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. సాగు భూములు ఉన్న గిరిజనులు పొలాల్లో బోర్లు వేయించుకోవాలని, వాటికి అవసరమైన త్రీఫేజ్ విద్యుత్ లైన్లను సబ్సిడీ ద్వారా మంజూరు చేయించే బాధ్యత తనదేనని అన్నారు. గిరిజన పొలాలకు అవసరమైన విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను అందించేందుకు విద్యుత్ శాఖ అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీఈ వెంకట రత్నం, ఏఈఈ సంతోష్, నాయకులు కోటగిరి సీతారామస్వామి, జూపల్లి ప్రమోద్, పి.లక్ష్మయ్య, మొడియం సూర్యచంద్రరావు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

భూముల కబ్జాను అరికట్టాలి

దుమ్ముగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి వ్యతిరేకంగా కబ్జాకి గురవుతున్న ప్రభుత్వ స్థలాలు, భూములను అధికారులు కాపాడాలని గిరిజన సంఘం నాయకుడు సొందె మల్లూరు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని ములకపాడు, లక్ష్మీనగరం గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా కట్టడాలు చేస్తున్నారని, తక్షణమే రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

‘ప్రజా పాలనలో అభివృద్ధి శూన్యం’



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

గుండాల: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నప్పటికీ చేసిన అభివృద్ధి శూన్యమని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శనివారం ఆయన ఆళ్లపల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పినపాక ఎమ్మెల్యే బినామీ పేర్లతో ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టారు తప్ప అభివృద్ధిపై కన్నెత్తి చూడడం లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఆళ్లపల్లి మండలానికి కోట్లలో నిధులు తీసుకువస్తే.. ఆయా అభివృద్ధి పనులు చేయడంలో ప్రస్తుత ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. మామకన్ను–బట్టుపల్లి మధ్య రోడ్డు, కిన్నెరసానిపై బ్రిడ్జి పనులకు అనుమతులు తీసుకురాక పనులు అర్ధాంతరంగా నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నేడు వాటిని గాలికి వదిలేసిందని, ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కేసులను బనాయిస్తోందని విమర్శించారు. సమావేశంలో ఆళ్లపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు పాయం నరసింహారావు, షేక్ బాబా, మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, మాజీ జెడ్పీటీసీ హనుమంతరావు, ఎండి.ఖయ్యూం, ఆరిఫ్, ఆదాం, నరసింహారావు, రాంబాబు సత్యం తదితరులు పాల్గొన్నారు.

మెచ్చా వ్యాఖ్యలు హాస్యాస్పదం

ములకలపల్లి: కాంగ్రెస్ పాలనపై మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు పేటేటి నర్సింహారావు అన్నారు. ములకలపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి పాలనలో అన్నివర్గాల ప్రభుత్వ ఇబ్బందులకు గుతున్నారంటూ మెచ్చా పేర్కొనడం శోచనీయమన్నారు. ఏడాది కాలంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు, రైతురుణ మాఫీ, ఆరోగ్యశ్రీ 10 లక్షలకు పెంపుదల తదితర పథకాలు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. ఒకప్పుడు పదేళ్లు కాంగ్రెస్‌లో ఉండి ఇప్పుడు కాంగ్రెస్ పాలనపై విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కొప్పుల రాంబాబు, పాలకుర్తి రత్నభూషణం, పాలకుర్తి రవి, పాలకుర్తి సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్, సోనియా వ్యాఖ్యలు సరికాదు

మణుగూరురూరల్: భారతదేశ ప్రథమ పౌరురాలు, దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా నాయకుడు లింగంపల్లి రమేష్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రపతిపై వ్యాఖ్యలు చేసి మనోవేదనకు గురి చేయడం హేయనీయమన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు దేశ పౌరసత్వాన్ని రద్దు చేసి, విషయాన్ని సుమోటాగా స్వీకరించాలని, తగు విచారణ చేపట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బహుజన్ సమాజ్ పార్టీ మండల ఇన్‌చార్జ్ కొప్పుల నారాయణ డిమాండ్ చేశారు. శనివారం బహుజన్ సమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి రేగుబల్లి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో కరెంటు సౌకర్యం లేదని, కేంద్రంలోని గచ్చు మొత్తం పగిలిపోయిందని తెలిపారు. తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం సగం నిర్మించి విడిచిపెట్టారని, తక్షణమే కార్యాలయ నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరారు. అంతర్గత రహదారులను నిర్మించాలన్నారు. సమస్యలన్నిటినీ తక్షణమే పరిష్కరించాలని సమావేశంలో డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పాయం ప్రసాద్, ఉపాధ్యక్షులు జక్కా వెంకట్, ప్రధాన కార్యదర్శి కొండా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియాలో 119 శాతం బొగ్గు ఉత్పత్తి



ఉత్పత్తి వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్

మణుగూరుటౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలో గడిచిన జనవరిలో 11.78లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి 13.99లక్షల ఉత్పత్తిని సాధించి 119 శాతంగా నమోదైంది. అలాగే, ఓబీ వెలికితీత లక్ష్యంలో 104శాతానికి చేరుకుంది. ఈ మేరకు ఏరియా ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్ జీఎం కార్యాలయంలో శనివారం వివరాలు వెల్లడించారు. బీటీపీఎస్‌లో ఒక యూనిట్ మరమ్మతుల దృష్ట్యా బొగ్గు అందుబాటులో ఉన్నా ఆశించిన మేర రవాణా జరగడం లేదని తెలిపారు. మార్చిలో యూనిట్‌ను అందుబాటులోకి వస్తే రవాణా సమస్య కూడా పరిష్కారమవుతుందని చెప్పారు. కాగా, వార్షిక లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తున్నామని, యంత్రాల పని గంటలు కూడా పెంచామని తెలిపారు. మణుగూరు ఓసీ గని జీవితకాలం ఏడాదే ఉండడంతో విస్తరణ, అటవీ భూమి సేకరణ పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. అధికారులు శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, సలగల రమేశ్, వెంకట్రావ్, శ్రీనివాసచారి, అనురాధ, శేషగిరి, సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



ములకలపల్లి: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండల పరిధిలో పలు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం సుడిగాలి పర్యటన చేశారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మల్కారం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. కొడిసెలగూడెం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన పెనుబల్లి భరత్ కుమార్ భౌతికకాయానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ములకలపల్లి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 7న జరుపతలపెట్టిన ‘లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘ మండల అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం గండుగులపల్లిలో పోస్టర్లను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా నిర్వహించే సభకు భారీగా తరలిరావాలని కోరారు. సంఘ జిల్లా నాయకులు గంటా వెంకటేశ్వర్లు, పిడియాల వెంకటేశ్వర్లు, కత్తి కాంతారావు, రావూరి వీరయ్య, చాపలమడుగు వెంకటేశ్వర్లు, రాయల పుల్లారావు, రామరాజు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో ఎంపీడీఓ తనిఖీ



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ ఏడాది హరితహారం పథకానికి అవసరమైన మొక్కలను నర్సరీల్లో సిద్ధంగా ఉంచాలని, నర్సరీల నిర్వహణలో అశ్రద్ధ చేయొద్దని స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని వేదాంతపురం, ఊట్లపల్లి, బచ్చువారిగూడెం, అనంతారం, బచ్చువారిగూడెం, గాండ్లగూడెంతోపాటు పలు పంచాయతీల్లో పర్యటించి నర్సరీలను సందర్శించారు. ఆయా నర్సరీల్లో మొక్కలను పరిశీలించి ప్రతీ రోజు మొక్కలకు వాటరింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ కె.రామచంద్రరావు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఎఫ్ఏలు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



విద్యార్థులకు స్టేషనరీ అందజేసిన ఫెలోషిప్ ప్రతినిధులు

చర్ల: సుబ్బంపేట గ్రామపంచాయతీలోని రాజయ్య నగర్‌లో ప్రభుత్వ పాఠశాల లేక ఓ యువకుడు తన ఇంటి వద్దే పాఠాలు బోధిస్తుండగా.. ఆయా విద్యార్థులకు శనివారం ఇంటర్నేషనల్ ప్రెయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఫెలోషిప్ చైర్మన్ జోష్ జోమోల్ ఆధ్వర్యంలో సుమారు 25 వేలతో సమకూర్చిన వీటిని ఫెలోషిప్ ఏరియా ప్రతినిధి పాస్టర్ వి.దానియేల్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. గ్రామంలోని విద్యార్థుల కోసం ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు రవికుమార్, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండా చరణ్, కార్యదర్శి ప్రవీణ్, నాయకులు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు..

గుండాల: శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు చాలా అవసరమని గుండాల సీఐ రవీందర్, స్థానిక వ్యాపార వేత్త మానాల వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ప్రెస్, పోలీసుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ పోటీ నిర్వహించారు. ప్రెస్, పోలీస్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌లు జరుగుగా రెండు సార్లు పోలీసు జట్టు విజయం సాధించింది. ఒకసారి ప్రెస్ జట్టు విజయం సాధించింది. ఈ పోటీ హోరాహోరీగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటలతో క్రీడాకారుల మధ్య స్నేహభావాలు పెంపొందుతాయన్నారు. అనంతరం ఆర్య, వైశ్య సంఘం ఆధ్వర్యంలో క్రీడాకారులకు షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ సభ్యులు యాసారపు తిరుపతి, టి.నాగరాజు, వై.యాకయ్య, ఎండి.యాకూబ్. ఎం.రంజీత్, సారంగపాణి, నారాయణ, సత్యం, వీరన్న, సురేష్, రాంబాబు, మానాల ఉపేందర్, రవి, వినయ్, గణేష్, అశోక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొమ్మకొమ్మకూ కాయలు!

అశ్వారావుపేటరూరల్: ఏడాకుల చెట్టు కొమ్మలకు ఆకులన్నీ రాలిపోయి, కాయలు మాత్రమే ఉండటంతో అవి కాస్తా చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ప్రధాన రహదారి పక్కనే ఏడాకుల చెట్టు ఉంది. ప్రస్తుతం ఈ చెట్టు ఆకులన్నీ నేల రాలిపోగా, కొమ్మలకు గుత్తులుగా కాయలు మాత్రమే మిగిలాయి. దీంతో కొమ్మకొమ్మకు గుత్తులుగా ఎరుపు రంగులో ఉన్న చెట్టు కాయలు అటువైపుగా వెళ్లే వారిని ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ దృశ్యాన్ని శనివారం ‘సాక్షి’ తన కెమెరాలో క్లిక్ మనిపించింది.



ఆకులు రాలిపోయి కొమ్మకొమ్మలకూ కాయలతో ఉన్న ఏడాకుల చెట్టు